క్లుప్తంగా

బాల్ బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల ప్రతిభ



పొదలకూరు: మండలంలోని అంకుపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపారు. శనివారం నెల్లూరు ఏసీ స్టేడియంలో నిర్వహించిన సబ్ జూనియర్స్ పోటీల్లో ఏడుగురు విద్యార్థులు జిల్లా స్థాయికి, 8 వ తరగతి చదువుతున్న యశ్వంత్, విష్ణుష్, పెంచలయ్య రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

వ్యక్తిపై దాడి



తలకు గాయాన్ని చూపుతున్న జయచంద్ర

కొడవలూరు: వ్యక్తిపై కర్రతో దాడి చేయగా తలకు తీవ్రగాయమైంది. ఈ ఘటన మండలంలోని పాతవంగల్లు వడ్డిపాళెంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామంలోని పిల్లలు స్థానికంగా క్రికెట్ ఆడుతుండగా గ్రామానికి చెందిన కృష్ణయ్య, లక్ష్మమ్మ దంపతులు అదే గ్రామానికి చెందిన జయచంద్రను పిల్లలతో క్రికెట్ నీవే ఆడిస్తున్నావంటూ వాదనకు దిగారు. తన కెలాంటి సంబంధం లేదని పిల్లలే స్వయంగా క్రికెట్ ఆటుకొంటున్నారని జయచంద్ర సమాధానం చెబుతుండగా, ఇంతలోనే కృష్ణయ్య కుమారుడు గుణశేఖర్ కర్రతో దాడి చేశారు. దీంతో జయచంద్ర తలపై తీవ్ర గాయమైంది. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై సీహెచ్.కోటిరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు సూచనలు చేస్తున్న హెల్త్ అసిస్టెంట్

కోవూరు: వసతి గృహ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ అసిస్టెంట్ షాలిని సూచించారు. కోవూరులోని సాంఘిక సంక్షేమ బీసీ బాలబాలికల వసతిగృహాల సముదాయంలో రెండో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సీజన్‌లో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు విస్తరిస్తాయని, విద్యార్థులు చిరుతిండ్లను దూరంగా ఉండాలన్నారు. తాగునీటిని తప్పనిసరిగా వేడి చేసి తీసుకోవాలన్నారు. వసతి గృహం పరిసరాల్లో చెత్త, నిల్వ నీరు ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ అధికారులు పద్మ, సుప్రజ, జ్యోతిరాణి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ఘటనా స్థలంలో ఆటో

వెంకటాచలం: రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొని నలుగురు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గూడూరు రూరల్ మండలం చెన్నూరుకు చెందిన ఆటోలో పది మంది గొలగమూడిలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమానికి వెళ్లారు. తిరిగి చెన్నూరుకు బయలుదేరారు. తిక్కవరప్పాడు సమీపంలో ఎదురుగా వచ్చిన గ్యాస్ సిలిండర్ల ఆటో ప్రయాణికుల ఆటోను ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలవడంతో స్థానికులు స్పందించి వెంటనే చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అప్పులబాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుచ్చి పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నగర పంచాయతీ పరిధిలోని పెద్దూరు హరిజనవాడకు చెందిన ఎల్.రమేష్ (45) స్థానికంగా జ్యూస్ దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా అప్పులపాలవడంతో కనిగిరి రిజర్వాయర్ వద్ద కొండల్లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సంతోష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

దందా ఆగేనా?

మండలంలోని కసుమూరులో మస్తాన్‌వలీ దర్గాలో భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. హుండీ కాంట్రాక్టర్లు, దర్గా ముజావర్లు బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటంపై విమర్శలున్నాయి.

- కసుమూరు దర్గాలో బలవంతపు వసూళ్లు
- ప్రశ్నించే వారితో ముజావర్ల వాగ్వాదం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న భక్తులు



దర్గాలో ఏర్పాటు చేసిన హుండీలు (ఫైల్)

కసుమూరు దర్గా ముఖద్వారం



కానుకలు (నగదు) ఇవ్వాలని ముజావర్లు డిమాండ్ చేయడంతో భక్తుల వాగ్వాదం (ఫైల్)



వెంకటాచలం: దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్‌వలీ దర్గాకు 248 సంవత్సరాల చరిత్ర ఉంది. అలాంటి దర్గాలో కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న బలవంతపు వసూళ్లపై భక్తులు తీవ్ర స్థాయిలో మండి పడుతున్నారు. దర్గా వద్ద ఏటా అత్యంత వైభవంగా నిర్వహించే గంధ మహోత్సవాలకు తెలుగు రాష్ట్రాలతోపాటుగా, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివస్తారు. ఆ సమయంలో భక్తుల ఇష్టానుసారంగా కానుకలు వసూలు చేస్తున్నారు.

కుమ్మక్కై..

దర్గాలో హుండీల్లో కానుకలకు సంబంధించి వక్ఫ్ బోర్డు అధికారులు వేలంపాట నిర్వహించి పాడుకున్న వారికి నిర్వహణ బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. కొన్నేళ్ల నుంచి హుండీ వేలం దక్కించుకుంటున్న నిర్వాహకులు వక్ఫ్ బోర్డు అధికారులు, దర్గా ముజావర్లతో కుమ్మక్కై భక్తుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలున్నాయి. హుండీ వేలంపాటలు గతంలో రూ.లక్షల్లో ఉంటే నేడు పోటీ పడిమరీ రూ.కోట్లకు దక్కించుకుంటున్నారు. దీనిని బట్టి భక్తుల నుంచి ఏ స్థాయిలో వసూళ్లకు పాల్పడుతున్నరనే విషయం స్పష్టమవుతోంది.

బోర్డు పర్యవేక్షణలోనే..

గతేడాది మే నెల 27 తేదీ నుంచి దర్గా హుండీ వేలం పాటలు నిర్వహించలేదు. హుండీల నిర్వహణ వక్ఫ్‌బోర్డు అధికారుల పర్యవేక్షణలోనే ఉంది. కాంట్రాక్టర్లు లేకపోవడంతో కొందరు ముజావర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దర్గాకు గురు, శుక్ర, ఆదివారాలతోపాటు, అమావాస్య రోజున ఎక్కువగా భక్తులు వస్తుంటారు. ఆ సమయంలో పలువురు ముజావర్లు భక్తులను నగదు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల కొందరు కానుకల్ని (నగదు) హుండీలో వేస్తామంటే ముజావర్లు అడ్డుకుని భక్తులను డిమాండ్ చేసి వసూళ్లకు పాల్పడ్డారు. ఆ సమయంలో తీసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి.

చర్యలు చేపట్టాలి

నిబంధనల ప్రకారం ఉత్సవాల సందర్భంగా రెండు హుండీలు మాత్రమే ఉండాలి. అయితే దర్గా లోపలికి వేళ్లే మార్గంలో అదనపు హుండీలు ఏర్పాటు చేసి వసూళ్లకు పాల్పడుతున్నారు. పలు సందర్భాల్లో భక్తులు ప్రశ్నిస్తే వారిపై దాడులకు తెగబడుతున్నారు. దర్గాలో తమపై జరిగిన దాడుల గురించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, కొందరు ముజావర్లు జోక్యం చేసుకుని కేసులు నమోదు చేయకుండా చూస్తున్నారు. త్వరలో మస్తాన్‌వలీ దర్గా గంధ మహోత్సవాలు జరుగనున్నాయి. ఈసారైనా భక్తులు నిలువు దోపిడీకి గురికాకుండా వక్ఫ్ బోర్డు, పోలీస్, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి

పొదలకూరు: మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలను శనివారం ఘనంగా చేసుకున్నారు. అనేకమంది దూర ప్రాంతాల నుంచి వచ్చి రాఖీలను సోదరులకు రాఖీ కట్టారు. పట్టణంలోని విజేత స్కూల్లో కరస్పాండెంట్ జి.కామాక్షి వేడుకలు జరిగాయి.

- **తోటపల్లిగూడూరు:** రక్షాబంధన్ సందర్భంగా మండలంలోని నరుకూరు సెంటర్‌లోని రాఖీల దుకాణాలు, స్వీట్ షాపులు కిటకిటలాడాయి. పండగ వాతావరణం నెలకొంది.
- **ఇందుకూరుపేట:** రాఖీ పండగను మండల వాసులు ఘనంగా జరుపుకున్నారు. సోదరులకు సోదరీమణులు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. గ్రామాల్లో కోలాహలం నెలకొంది.
- **మనుబోలు:** రాఖీ పౌర్ణమిని శనివారం మండల కేంద్రమైన మనుబోలులో ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక విద్యానికేతన్ కోచింగ్ సెంటర్‌లో విద్యార్థులు పండగను చేసుకున్నారు.



మొగళ్లూరులో రాఖీ కడుతూ..



పొదలకూరులో..



చిన్నచెరుకూరులో..



మనుబోలులో..

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన నేడు

తోటపల్లిగూడూరు: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మండలంలోని కోడూరు పంచాయతీ మహాలక్ష్మీపురం సెంటర్‌లో ఆదివారం నిరసన కార్యక్రమం జరుగుతుందని సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు గుదిబండగా మారుతాయన్నారు. వినియోగదారులకు ఎంతో నష్టం కలిగించే ఈ ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలన్నారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలతో పాటు, విద్యుత్ వినియోగదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

పొదలకూరు: పట్టణంలోని గంగమ్మతల్లి కొలుపులో భాగంగా రెండోరోజు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు పూజలు, 11 గంటలకు పోతురాజు ముగ్గుకి దిష్టి తీర్పు, రాత్రి 7 గంటలకు మేళతాళాల నడుమ అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. యాదవరాజులు వీరతాళ్ల అడుగులతో అత్యంత వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పగటివేళ వీధి దీపాల వెలుగులు



పద్మావతినగర్‌లో..

పొదలకూరు: పగటి సమయంలో వీధి దీపాలు వెలుగుతూ విద్యుత్ వృథా అవుతున్నా పట్టించుకోవడం లేదు. కొంతకాలంగా పట్టణంలోని పద్మావతినగర్, తొగటవీధి ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంది. స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదు. నిర్వహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఇందుకూరుపేట: మండలంలోని ముదివర్తిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. 1957 నుంచి చదువుకున్న పలువురు పూర్వ విద్యార్థులు, నేటి ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు ఒకచోటు చేరుకోవడంతో పండగ వాతావరణం నెలకొంది. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కుటుంబ సభ్యులు, పిల్లల గురించి ఆరా తీసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పాఠశాలలో చదివే రోజుల్లో తీసుకున్న ఫొటోలను చూసి మురిసిపోయారు. అనంతరం ఎంఈఓ సునీల్, హెచ్‌ఎం సదానందం పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాఘవేంద్ర, ముజీర్, రంగారెడ్డి, వెంకట రమణయ్య, రవి, సుబ్బారెడ్డి, చాంద్‌బాషా, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. మహిళా భక్తులకు నిర్వాహకులు ముత్యాల తలంబ్రాలను అందజేశారు. అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.



ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

మనుబోలు: విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రాజయ్య సూచించారు. మనుబోలులోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లోని విద్యార్థులకు శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ సుధామణి, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటరమణయ్య, స్నేహలత, మేట్రిన్‌లు రాజేశ్వరి, అనిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీహెచ్‌ఓ రాజయ్య

పూజితకు పలువురి అభినందన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కాకాణి పూజితారెడ్డిని నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం పలువురు సత్కరించారు. జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి స్వర్ణ వెంకయ్య, ప్రజాసత్తా జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు కలిసి అభినందనలు తెలిపారు.



పూజితను సత్కరిస్తున్న వెంకయ్య

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



నేత్రపర్వంగా సాగుతున్న పల్లకిసేవ



పూజా కార్యక్రమాలు జరిపిస్తున్న అర్చకులు

కోవూరు: కోవూరులోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు శ్రీకాంతాచార్యులు, సుబ్బయ్యస్వామి, నందకిశోర్‌స్వామి, ఫణీంద్రస్వామి వివిధ రకాల పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపారు. రాత్రి పల్లకిసేవ నేత్రపర్వంగా నిర్వహించారు. ఉభయకర్తలు ఎస్.సాయిగణేష్ బాబు, కిన్నెర కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి రూరల్: నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడు మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో 2025 – 26 విద్యా సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఎస్సీ – 8, ఎస్టీ – 5, పీహెచ్‌సీ – 5 తదితర ఖాళీలు ఉన్నాయన్నారు. ఈనెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారికి 16న ప్రవేశపరీక్ష జరగుతుందన్నారు. ప్రతిభ ఆధారంగా సీటు ఇస్తారన్నారు. అలాగే మైనార్టీ విద్యార్థులను 5 నుంచి 8వ తరగతి వరకు ఎలాంటి ప్రవేశపరీక్ష లేకుండా నేరుగా తీసుకుంటామన్నారు. వివరాలకు 87126 25045, 90008 46065, 94933 80898 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

దాతల సహకారం.. మారిన రూపురేఖలు

- ఫైర్ స్టేషన్ చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం
- మెయిన్ గేట్ ఏర్పాటు

పొదలకూరు: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం రూపురేఖలు మారాయి. దాతల ఔదార్యంతో చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టిన స్టేషన్ సిబ్బంది మొక్కలను నాటుతున్నారు. నేరేడుతోపాటు పూల మొక్కల పెంపకం చేపట్టారు. స్టేషన్ అభివృద్ధి కోసం నిధులు లేకపోయినా రూ.లక్షలతో పనులను పూర్తి చేశారు. ఇందుకోసం దాతల సహకారం తీసుకుంటున్నారు. సాధారణంగా గుర్తింపు లేని ప్రభుత్వ శాఖగా పేరున్న అగ్నిమాపక శాఖ విషయంలో దాతలు ముందుకు రావడం కూడా గొప్ప విషయం. స్టేషన్ ప్రాంగణంలో పచ్చదనం పరుచుకోవడంతో ఆహ్లాదకర వాతావరణం ఉంది. 200 అంకణాల విస్తీర్ణం కలిగిన స్టేషన్ స్థలానికి హద్దులు సక్రమంగా లేకపోవడంతో సర్వే చేయించారు. హద్దులు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టారు. అలాగే గుంతలమయంగా ఉన్న ప్రాంగణంలో గ్రావెల్ తోలించి రోలర్‌తో చదును చేశారు. రకరకాల పూలమొక్కలను నాటేందుకు గేటును మరమ్మతులు చేయించారు. పొదలకూరు అగ్నిమాపక కేంద్రం పొదలకూరు, చేజర్ల, కలువాయి మండలాల పరిధిలో పనిచేయించాల్సి ఉంది. సరైన భవనం లేకపోవడంతో రిపేర్లకు ఫైర్ అధికారే నిధులు సమకూర్చుకుని కూలేస్థితిలో ఉన్న శ్లాబుకు మరమ్మతులు నిర్వహించారు.



పశువులు ప్రవేశించకుండా నిర్మించిన గేటు



దాతల సహకారంతో పూర్తి చేసిన ఫెన్సింగ్

పచ్చదనం కోసం ప్రయత్నం



ఫైర్ స్టేషన్‌లో పచ్చదనం కోసం ప్రయత్నం చేశాం. గతంలో పనిచేసిన వారు కూడా కృషి చేయడం జరిగింది. నా హయంలో భవన మరమ్మతులతోపాటు మొక్కలు నాటించాం. గేటుకు రిపేర్లు చేయించి దెబ్బతిన్న ఫెన్సింగ్‌ను పునరుద్ధరించడం జరిగింది.

– విజయవరప్రసాద్, ఫైర్ ఆఫీసర్, పొదలకూరు

గోవర్ధనన్న వచ్చిన రోజే రక్షాబంధన్



మాట్లాడుతున్న మహిళలు, ప్రజాప్రతినిధులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అక్రమ కేసులతో జైలులో ఉన్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్న బయటకు వచ్చిన రోజే తమకు నిజమైన రక్షాబంధన్ అని వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి మహిళా విభాగం వారు అన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం పొదలకూరు జెడ్పీటీసీ సభ్యురాలు నిర్మలమ్మ మాట్లాడుతూ ఇంటికే పరిమితమైన మాలాంటి మహిళల రాజకీయ ఎదుగుదల గోవర్ధనన్న ప్రోత్సాహమేనన్నారు. అందరి ఆశీర్వాదంతో అక్రమ కేసుల నుంచి బయటకు రావాలని ఆకాంక్షించారు. తోటపల్లిగూడూరు జెడ్పీటీసీ సభ్యురాలు శేషమ్మ మాట్లాడుతూ 2014 నుంచి సామాన్య కార్యకర్త స్థాయి నుంచి జెడ్పీటీసీ వరకు ఎదిగేందుకు గోవర్ధన్‌రెడ్డి ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ముత్తుకూరు ఎంపీపీ సుగుణమ్మ మాట్లాడుతూ రాఖీ పండగ అంటే మాకు గోవర్ధనన్న ఇచ్చే ధైర్యమే గుర్తుకు వస్తుందన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండే వ్యక్తి నేడు జైలులో ఉండడం దురదృష్టకరమని, కడిగిన ముత్యంలా ఆయన బయటకు వస్తారన్నారు. పొదలకూరు ఎంపీటీసీ లక్ష్మీకల్యాణి, మనుబోలు ఎంపీటీసీ రాజేశ్వరి, మామిడిపూడి సర్పంచ్ మస్తానమ్మలు మాట్లాడుతూ అన్న అనే బంధానికి నిలువెత్తు రూపం మా గోవర్ధనన్న అని, సర్వేపల్లి ఆడపడుచులు ఆయనకు అండగా ఉంటారన్నారు. సర్వేపల్లి మహిళా అధ్యక్షురాలు సంధ్యారాణి మాట్లాడుతూ గోవర్ధనన్న త్వరలోనే బయటకు వచ్చి, మరింత ఉత్సాహంతో ప్రజా పోరాటాలు చేస్తారన్నారు.